క్లుప్తంగా

లలితాదేవికి పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కొత్తపల్లి: సంగమేశ్వరం ఎగువన ఉన్న ఉమా మహేశ్వరాలయంలో ఆదివారం లలితాదేవికి పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్వీజ బహుళదశమి సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి కుంకుమార్చన, పుష్పార్చన, పూజాక్రతువులు చేశారు. అదేవిధంగా శివలింగానికి కృష్ణాజలాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజాకాంకర్యాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

మసీదులో చోరీ



చిందరవందరగా పడి ఉన్న పుస్తకాలు

బండిఆత్మకూరు: మండల పరిధిలోని భోజనం గ్రామంలో ఉన్న మక్కా మసీద్‌లో చోరీ జరిగిందని స్థానికులు తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున నమాజ్ కోసం మసీద్‌లోకి వెళ్లి చూడగా బీరువా ధ్వంసమై కనిపించింది. అందులో ఉన్న రూ.3 వేలు చోరీ చేసినట్లు మసీద్ మౌజన్ అన్వర్ తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రైతు బజారు నిరుపయోగమేనా?



రైతు బజార్ వద్ద మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: పట్టణంలోని మార్కెట్ యార్డులో రూ.65 లక్షలతో నిర్మించిన రైతు బజారు ఉపయోగంలోకి తీసుకునిరావాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వి.యేసురత్నం, పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, నాయకులు డి.రామ్‌నాయక్, స్వాములు, వీరన్న అన్నారు. ఆదివారం నిరుపయోగంగా ఉన్న రైతు బజారును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లక్షలాది రూపాయలు వెచ్చించినప్పటికీ రైతులకు, ప్రజలకు రైతు బజార్ ఉపయోగపడకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి రైతు బజారు ద్వారా ప్రజలకు కూరగాయలు సరసమైన ధరలకు అందించాలని కోరారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని నంద్యాల జిల్లా ఫ్యాప్టో చైర్మన్, సెక్రటరీ కోరారు. ఈ మేరకు నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఈఓ జనార్దన్‌రెడ్డికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆదివారం అందజేశారు. నాయకులు సుబ్బన్న, రామచంద్రారెడ్డి, నగరి శ్రీనివాసులు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంఈఓ–1, 2 పోస్టులను సీనియర్ ప్రధానోపాధ్యాయులతో భర్తీ చేయాల న్నారు. అలాగే ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులను జిల్లా కేంద్రంలో లేదా, ఉమ్మడి జిల్లా కేంద్రంలో నిర్వహించాలన్నారు. ఖాళీగా ఉపాధ్యాయ పోస్టుల్లో విద్యావలంటీర్లను నియమించాలని కోరారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ప్రసంగిస్తున్న కవులు

శ్రీశైలం టెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. శైవసాహిత్య కవితావైభవం అనే అంశంపై నిర్వహించిన ప్రసంగ కార్యక్రమంలో డా.పోతూరి సుబ్రహ్మణ్యకవి శ్రీశైల క్షేత్ర ప్రాశస్త్యాన్ని వివరించారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన బ్రహ్మశ్రీ పురోహితం వట్టి విజయ్‌కుమార్ శర్మ భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్ల మహిమా విశేషాలను వివరించారు. ప్రభ్యాశంకర్ శివభక్తి వైశిష్ట్యంపై ప్రసంగించారు.

నష్టం కొండంత..పరిహారం గోరంత!

- నష్టపరిహారం అందజేయడంలో రైతన్నపై చిన్నచూపు
- మొక్కజొన్న రైతులకు అరకొర నష్టపరిహారం
- ఎకరాకు పదివేలు ఇవ్వని ప్రభుత్వం



ఎర్రమఠం సమీపంలో వర్షాలకు పూర్తిగా నేలపై పడిపోయిన మొక్కజొన్న పంట



కొత్తపల్లి సమీపంలో నీట మునిగిన వరిపైరు (ఫైల్)

కొత్తపల్లి: ఆరుగాలం కష్టపడే రైతన్నకు తీవ్ర నష్టం జరుగుతూనే ఉంది. వర్షాభావ పరిస్థితులు ముంచుతూనే ఉన్నాయి. ఈ ఖరీఫ్‌లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అండగా నిలవాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో రైతన్నలు అప్పుల్లో కూరుకుపోతున్నారు. వ్యవసాయం చేయాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మొత్తం 12 గ్రామపంచాయతీలు, 11 ఆర్బీకేలు ఉండగా ఇందులో ఈ ఖరీఫ్ సీజన్‌కు 7,397 మంది రైతులు వివిధ రకాల పంటలను సాగుచేసుకున్నారు. సాధారణ సాగుభూమి 9,090 హెక్టార్లు కాగా ఇందులో ఈ ఖరీఫ్ సీజన్‌కు 8,400 హెక్టార్లు రైతులు మొక్కజొన్న, మినుము, మిరప, కంది, వరి వంటి పంటలను సాగుచేసుకున్నారు. అత్యధికంగా మొక్కజొన్న 5 వేల హెక్టార్లు, వరి 1,092 హెక్టార్లు, మినుము 400 హెక్టార్లలో రైతులు సాగుచేసుకున్నారు. అయితే అకాల వర్షాలు అన్నదాతను ముంచాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం అరకొర నష్టపరిహారం అందజేయడంతో ఆందోళన చెందుతున్నారు రైతులు.

రైతన్నను ముంచిన అధిక వర్షాలు

పంటలు బాగా పెరుగుతున్నాయి. దిగుబడి ఈ ఏడాది ఎక్కువగా వస్తుంది అనుకుంటుండగా అధిక, అకాల వర్షాలు రైతన్నలను నట్టేట ముంచినంత పనిచేశాయి. అప్పటివరకు కలకలలాడుతున్న పంటలు కాస్తా నీలుపాలు అయ్యాయి. దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. అయితే అకాల వర్షాలకు పంటలు నష్టపోవడంతో దిగాలుతో ఉన్న రైతన్నలకు టీడీపీ ప్రభుత్వం అరకొర నష్టపరిహారం ఇవ్వడంతో రైతుల చతికిల పడ్డారు. కనీసం ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి పెడితే అందులో పదోవంతు కూడా ఇవ్వకపోవడం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. కొందరు రైతులకు అస్సలు నష్టపరిహారం పడలేదని బహిరంగంగానే విమర్శిస్తున్నారు. మండలంలో మొక్కజొన్న 3200 హెక్టార్లు, వరి 200 హెక్టార్లలో అకాల వర్షాల కారణంగా నష్టపోయినట్లు అధికారులు అంచనా వేశారు. అన్ని పంటలకు గాను సుమారు 6 వేల హెక్టార్లలో పంటలు నష్టపోయాయని రైతులు నివేదికలు పంపినా కేవలం వందల ఎకరాల్లో నష్టపరిహారం అందినట్లు రైతులు వాపోతున్నారు. 7వేలకు పైగా రైతులు ఉంటే 4,297 మందికి మాత్రమే అది కూడా అంతంత మాత్రంగానే నష్టపరిహారం అందిందని కర్షకులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఇతర పంటలలో కూడా చాలీచాలని నష్టపరిహారం ఇచ్చి టీడీపీ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ప్రజలు వాపోతున్నారు.

ఒక్కరూపాయి పరిహారం రాలేదు



నేను ఖరీఫ్ సీజన్‌లో మూడు ఎకరాలలో మొక్కజొన్న పంట సాగు చేశా. దాదాపు రూ. లక్ష ఖర్చు అయ్యింది. పంటబాగా పెరిగి బాగుందనుకుంటున్న సమయంలో అధికవర్షాలు కొంపముంచాయి. మొత్తం పంట నీటిపాలు అయింది. తీవ్రంగా నష్టపోయాను. ఆదుకోవాల్సిన ప్రభుత్వం అస్సలు ఒక్కరూపాయి కూడా నష్టపరిహారం ఇవ్వలేదు. ప్రభుత్వం ఇలా చేస్తుందనుకోలేదు.
–చాకాలి మద్దిలేటి, రైతు, ఎర్రమఠం

మళ్లీ సర్వేచేసి రైతులకు న్యాయం చేయాలి



అధికవర్షాల కారణంగా నష్టపోయిన రైతుల తగిన నష్టపరిహారం అందించాలి. మండలంలో వ్యవసాయ అధికారులతో మళ్లీ సర్వే చేయించాలి. నష్టం జరిగిన వివరాలను రైతులకు కూడా బహిరంగంగా తెలియజేయాలి. బాధిత రైతులందరికీ నష్టపరిహారం అందజేసి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.
– స్వాములు, సీపీఎం మండల నాయకుడు

ఎకరాకు పదివేలు కూడా ఇవ్వలేదు



నాకున్న రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. రెండు ఎకరాలకు రూ.60వేలదాకా పెట్టుబడి అయ్యింది. అయితే అకాల వర్షాల కారణంగా పూర్తిగా పంట దెబ్బతినింది. అయితే ప్రభుత్వం మాత్రం కేవలం రూ.6250 మాత్రమే నష్టపరిహారం మంజూరు చేసింది. పెట్టుబడిలో పావలావంతు కూడా న్యాయం చేయలేదు. అప్పుల్లో పడ్డాం. ప్రభుత్వం ఆదుకోవాలి. –కిష్టన్న, రైతు, బట్టువారిపల్లె గ్రామం

పరిసరాల శుభ్రత పాటించాలి

పాములపాడు: ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని సర్పంచ్ ప్రసాదరావు సూచించారు. మండలంలోని తుమ్మలూరు గ్రామంలో ఆదివారం సర్పంచ్ పారిశుద్ధ్య పనులు చేయించారు. జేసీబీతో డ్రైనేజీ కాలువలు పరిశుభ్రం చేయించారు. ఇళ్లలోని చెత్తా చెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా చెత్త సేకరణ బండ్లలోనే వేయాలని ఈ సందర్భంగా సర్పంచ్ ప్రజలకు సూచించారు.

5న సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం

పగిడ్యాల: 2023–24 ఆర్థిక సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద మండలం వ్యాప్తంగా జరిగిన పనులపై నవంబర్ 5న సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఏపీఓ మద్దిలేటి తెలిపారు. ఈనెల 29 నుంచి 30 వరకు మండలంలోని 8 గ్రామపంచాయతీల్లో సామాజిక తనిఖీ బృందం సభ్యులు గ్రామసభలు నిర్వహిస్తారన్నారు. నవంబర్ 5న ఎంపీడీఓ కార్యాలయం వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

మహానందిలో సండే సందడి

మహానంది: ఆదివారం సెలవు రోజు కావడంతో మహానందిలో భక్తులతో సందడి నెలకొంది. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని ముందుగా కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. సెలవు రోజుతో పాటు పెళ్లిళ్లు అధిక సంఖ్యలో జరగడంతో ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ కనిపించింది. నూతన వధూవరులు కామేశ్వరీ దేవి, మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేకువజామున స్వామి, అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళ హారతులు ఇచ్చారు.

ఇస్కాలలో సోదాలు



ఇంట్లో సోదాలు చేస్తున్న పోలీసులు

పాములపాడు: మండలంలోని ఇస్కాల గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐలు సురేష్‌బాబు, లక్ష్మీనారాయణ సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఎక్సైజ్ కేసులలో పట్టుబడిన నిందితులు, అనుమానితుల ఇళ్లను సోదా చేశారు. రికార్డులులేని 11 ద్విచక్రవాహనాలు, ఒక ఆటోను సీజ్ చేశారు. అనంతరం గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయని, వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, తల్లిదండ్రుల పై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లోకి అనుమానిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

సీడ్‌ఫారం భూములు అభివృద్ధి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

జూపాడుబంగ్లా: తంగడంచ సీడ్ ఫారం భూములను అభివృద్ధి చేయటంతో పాటు జైన్ కంపెనీలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని తర్తూరు గ్రామంలో సీపీఎం మండల మహాసభను నిర్వహించారు. ముందుగా పార్టీ పతాకావిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాటిపాడు ఎత్తిపోతల పథకం మోటార్లకు మరమ్మత్తులు చేయించి రబీపంటలకైనా సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. తదనంతరం పార్టీ మండల నూతన కమిటీ కన్వీనర్‌గా కర్ణ ఎన్నుకున్నారు. అదేవిధంగా కోకన్వీనర్‌గా రాము, కమిటీ సభ్యులుగా రంగమ్మ, శ్రీనివాసులు, నాగేశ్వరరావు, పద్మావతమ్మ, నాగన్నతో పాటు మరో ఏడుగురిని సభ్యులుగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో నాయకులు లోకారెడ్డి, శివ, జయరాణి, రంగన్న, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ పర్యటనను విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న కేవీ రమణ

నందికొట్కూరు: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నవంబరు 5వ తేదీన జిల్లాలో పర్యటిస్తారని, నాయకులు,కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేద్దామని ఆ సంఘం జాతీయ నాయకుడు కేవీ రమణ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి కర్నూలు పర్యటనకు మందకృష్ణ మాదిగ వస్తున్నారని, ఎస్సీ వర్గీకరణను సాధించిన ఆయనకు ఘనంగా స్వాగతం పలుకుదామన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు భవిష్యత్తు ఉద్యమ కార్యచరణ సదస్సును కర్నూలులో నిర్వహిస్తునట్లు చెప్పారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రేమరాజు, విజ్జి, శేషన్న, మోహన్, కళాకర్, రాజు, రాము, వంశీ, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

21న సాగునీటి సలహా సంఘాల ఎన్నికలు

జూపాడుబంగ్లా: కర్నూలు–కడప కాల్వ ఆయకట్టు రైతులకు నవంబర్ 21న సాగునీటి వినియోదారుల సంఘం ఎన్నికలు నిర్వహించనున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూపాడుబంగ్లా సాగునీటి వినియోగదారుల సంఘం(డబ్ల్యూయుఏ) కింద తాటిపాడు, భాస్కరాపురం, 80బన్నూరు, తరిగోపుల గ్రామాలతో పాటు ప్రాతకోట గ్రామానికి చెందిన కొంత మంది ఓటర్లు కలిసి మొత్తంగా 1,400మంది ఆయకట్టు రైతులు ఓటర్లుగా ఉంటారని తెలిపారు. ప్రస్తుతం రెవెన్యూ కార్యదర్శులు గ్రామాల్లోని ఆయకట్టు రైతుల వివరాలను ఆధారంగా చేసుకొని ఓటర్ల జాబితా సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల్లోగా ఓటర్ల జాబితా ప్రక్రియ పూర్తికానుండగా జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు. ఓటర్ల జాబితాను పరిశీలన చేసుకొని ఆయకట్టు రైతులు ఎవ్వరైనా వారి పేర్లు లేనట్లయితే పట్టాదారు పాసుపుస్తకం ఆధారంగా ఓటర్ల జాబితాలో పేర్ల చేర్పులు, మార్పులు చేసుకోవచ్చున్నారు. తుది ఓటర్ల జాబితా అనంతరం నవంబర్ 21న సాగునీటి వినియోగదారుల సంఘం ఎన్నికలను నిర్వహించి సంఘం అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడులతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకోవటం జరుగుతుందని ఏఈ తెలిపారు. 2014లో ఓ పర్యాయం జరిగిన సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు ఇప్పటిదాకా నిర్వహించలేదు. దీంతో కేసీ కాల్వ కింద ఆయకట్టు పొలాలకు వెళ్లేందుకు సరైన రోడ్లు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే కేసీ కాల్వకు సాగునీరు ఎప్పటి నుంచి ఎప్పటిదాకా సరఫరా చేస్తారనే విషయమై ఏటా స్పష్టమైన సమాచారం లేక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు నిర్వహిస్తే అన్ని విషయాలపై స్పష్టత లభించే అవకాశాలున్నాయని ఆయకట్టు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కులగణనతోనే సామాజిక న్యాయం



చర్చా వేదికలో మాట్లాడుతున్న వక్తలు

వెలుగోడు: కులగణన చేపట్టి దాని ప్రకారం రిజర్వేషన్లు, బడ్జెట్ కేటాయింపులు జరిగితేనే ఆయా వర్గాలు అభివృద్ధి చెందగలరని వక్తలు పేర్కొన్నారు. స్థానిక లిటిల్ ఏంజిల్స్ పాఠశాలలో ఆదివారం సాయంత్రం కులగణాలతోనే సామాజిక న్యాయం అనే అంశంపై చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.రఘురాముడు యాదవ్, లిటిల్ ఏంజిల్స్ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఇమ్మానుయేల్, లాయర్ రవి, ఉపాధ్యాయ సంఘం తాలూకా నాయకుడు రామకృష్ణ మాట్లాడారు. కులగణనను చేపట్టాలని, బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించి చట్టసభల్లో రిజర్వేషన్ ఎందుకు చేయరని ప్రశ్నించారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ, సంఘాల నాయకులు ఖలీల్, సుంకన్న, జోస్నస్న, ఫయాజ్, రఫీ, షాలు, నాగేశ్వరరావు యాదవ్ పాల్గొన్నారు.

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

- విద్యార్థుల పేర్లు, పుట్టినతేదీ కోసం తల్లిదండ్రులకు తప్పని ప్రయాస



తాటిపాడు సచివాలయం వద్ద సర్టిఫికెట్ల కోసం వేచి ఉన్న తల్లిదండ్రులు

జూపాడుబంగ్లా: ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రేషన్ (అపార్) నమోదు ప్రక్రియతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆధార్ కేంద్రాలు, సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. విద్యార్థుల సౌలభ్యం కోసం కేంద్ర ప్రభుత్వం ఓ విద్యార్థికి ఆధార్‌కార్డు నంబర్‌లానే ఓ రిజిస్ట్రేషన్ నంబర్ కేటాయించేందుకుగాను విద్యార్థుల వివరాలను యుడైస్‌ప్లస్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఒకటోవ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యను అభ్యసిస్తున్న ప్రతి విద్యార్థి వివరాలను వారు విద్యను అభ్యసిస్తున్న పాఠశాలల్లో నమోదు చేయాల్సి ఉంది. విద్యార్థి చదివే పాఠశాల రికార్డుల్లోని విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, ఆధార్‌కార్డులోని పేరు, పుట్టినతేదీ రెండు ఒక అక్షరం తేడాలేకుండా ఉంటేనే ఆన్‌లైన్‌లో పొందుపర్చటానికి వీలవుతుంది. లేని ఎడల సంబంధిత వివరాలను మార్చుకోవాల్సి ఉంటుంది. ఆధార్‌కార్డులో పుట్టినతేదీ, పేరు మార్చుకోవాలంటే విద్యార్థి పదోతరగతి పాసైన మార్కుల మెమో ఉంటేనే ఆధార్‌కేంద్రాల్లో మార్చుతున్నారు. లేకపోతే విద్యార్థి చదివిన పాఠశాలల్లో దిగువ తరగతి టీ సీలో చేర్పులు, మార్పులు చేయించుకోవడం లేదా విద్యార్థి పుట్టిన ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయాలకు వెళ్లి సరి చేసుకోవాల్సి వస్తుంది. ఇదంతా కాదనుకుంటే పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవడం ద్వారా తహసీల్దార్ కార్యాలయాల్లో నోఅవెలబుల్ సర్టిఫికెట్ తీసుకొని ఆర్డీఓ కార్యాలయం వెళ్లి అక్కడ ప్రొసిడింగ్స్ పొందటం ద్వారా సచివాలయాల్లో పుట్టినతేదీ సర్టిఫికెట్ పొందే అవకాశం ఉంది. కొంత మంది విద్యార్థుల ఆధార్‌కార్డుల్లో పేర్లు సక్రమంగా ఉన్నా కొన్ని పాఠశాలల్లోని కంప్యూటర్ ఆపరేటర్లు పేర్లల్లోని అక్షరాలు చైల్డ్‌ఇన్‌ఫోలో తప్పుగా నమోదు చేయటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో యుడైస్‌ప్లస్ వెబ్‌సైట్‌లో విద్యార్థుల వివరాలు నమోదు కావటం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు పాఠశాలల్లోని కంప్యూటర్ ఆపరేటర్లు రెండు, మూడు రోజుల్లోనే సరిచేసిన వివరాలను అందజేయాలని పేర్కొనటంతో తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. పిల్లల పేర్లు, పుట్టినతేదీ, చేర్పులు, మార్పులకోసం సచివాలయాలు, ఆధార్‌కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లోని అధికారులు విద్యార్థుల తల్లిదండ్రుల సమస్యను అర్థం చేసుకుని త్వరగా వారికి అవసరమైన సర్టిఫికెట్లు అందజేయాలని కోరుతున్నారు.

1న హనుమాన్ చాలిసా పఠనం

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీఅభయ ఆంజనేయ స్వామి దేవస్థానంలో నవంబర్ 1వ తేదీ శుక్రవారం అమావాస్య సందర్భంగా రాత్రి 7 గంటల నుంచి 8:30 గంటల వరకు హనుమాన్ చాలిసా పఠనం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. అలాగే స్వామివారికి ఉదయం నుంచి జలాభిషేకం , కుంకుమార్చన పూజలు జరుగుతాయని తెలిపారు. రాత్రి 8:30 గంటల నుంచి స్వామివారికి హారతి, ఏక హారతి, కుంభహారతి, నాగహారతి, శంఖ చక్ర, నక్షత్ర హారతులు, మహా మంగళహారతుల ఉంటాయన్నారు. భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

మహదేవపురంలో కార్డన్ సెర్చ్




ఓ ఇంట్లో సోదా చేస్తున్న పోలీసులు

శిరివెళ్ల: మండలంలోని మహదేవపురం గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌లోని ఎస్ఐలు, సిబ్బంది కలిసి గ్రామంలోని రౌడీషీటర్లు, అనుమానితులు, నాయకుల ఇళ్లలో సోదాలు చేశారు. అనంతరం గ్రామంలో కవాతు నిర్వహించి ప్రజలు ఎటువంటి నేరాలకు పాల్పడరాదని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ వంశీధర్ ప్రజలకు సూచించారు. అనంతరం ఎటువంటి రికార్డులు లేని 18 మోటార్ సైకిళ్లను సీజ్ చేశారు.

అయోడిన్ ఉప్పునే వినియోగించాలి

నంద్యాల(వ్యవసాయం): ఆహార పదార్థాల్లో అయోడిన్ కలిగిన ఉప్పును మాత్రమే వాడాలని ఫుడ్‌సేఫ్టీ అధికారులు రాముడు, కాశీంవలి సూచించారు. ఆదివారం నూనెపల్లె నర్స్ క్వార్టర్స్‌లోని సత్య సమీక్ష కేంద్రంలో శ్రీవాసవీ రిటైల్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అయోడిన్ లోపాల వ్యాధుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వ్యాపారులకు ఫుడ్‌సేఫ్టీ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండెడ్ యాక్ట్ ప్రకారం అయోడిన్ కలిగిన ఉప్పునే విక్రయించాలని, ఇటువంటి వాటినే వినియోగదారులకు అమ్మాలని సూచించారు. అయోడిన్ లేని ఉప్పు వాడటం వల్ల గాయిటర్, థైరాయిడ్, బుద్ధి మాంద్యం, పుట్టబోయే పిల్లలకు ఎదుగుదల ఉండదని చెప్పారు. అధికారులు రాముడు, రిటైల్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రజనీకాంత్, మేడం విజయ్, రవి కుమార్ పాల్గొన్నారు.

క్రాస్‌రెగ్యులేటర్ నుంచి నీటి విడుదల



బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి విడుదలవుతున్న నీరు

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు నుంచి ఆదివారం 15,000 క్యూసెక్కులను విడుదల చేసినట్టు ఏఈ దేవేంద్ర తెలిపారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఎస్ఆర్ఎంసీ ద్వారా 15,000 క్యూసెక్కులు చేరుతున్నందున, దిగువకు విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. తెలుగుగంగ(వీబీఆర్)కు 3,000 క్యూసెక్కులు, జీఎన్ఎస్ఎస్‌కు 10,000, కేసీసీ ఎస్కేప్ ఛానల్‌కు 2,000 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నామని వివరించారు.

నిప్పులవాగుకు 1,057క్యూసెక్కులు విడుదల

జూపాడుబంగ్లా: లాకిన్స్‌లా నుంచి నిప్పులవాగుకు 1,057క్యూసెక్కులను సరఫరా చేస్తున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 2500క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. లాకిన్స్‌లా వరకు 1,403 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. 1,057క్యూసెక్కులు నిప్పులవాగుకు, 312 క్యూసెక్కులు తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు, 34క్యూసెక్కులు ఏబీఆర్ కాల్వకు సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నంద్యాల(న్యూటౌన్): శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకుంటేనే సమాజం పురోభివృద్ధి వైపు నడుస్తుందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు, వ్యవస్థాపకుడు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను పట్టణంలోని న్యూక్లియస్ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. టాలెంట్ టెస్ట్‌కు జిల్లాలోని 22 మండలాల నుంచి 46 టీములు పాల్గొన్నాయి. పరీక్షల్లో ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల నుంచి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రసాదరెడ్డి, ఉదయ్, మహేశ్వరి జిల్లా ప్రథమ స్థానం, ద్వితీయ స్థానంలో ఏపీ మోడల్ స్కూల్ పాములపాడు విద్యార్థులు యశ్విని, జ్యోతిక, పల్లవి, నంద్యాల మండల మోడల్ స్కూల్ క్రాంతినగర్ విద్యార్థులు సుమేధా, జ్యోత్స్న, రితిషాలు తృతీయ స్థానంలో నిలిచారన్నారు. అలాగే ప్రైవేటు పాఠశాలల్లో గుడ్‌షెప్పర్డ్, సుధా, గౌతమ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులకు బహుమతులు అందజేశామన్నారు. వేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ టి.నాగరాజు, ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి, సభ్యులు పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ కార్యాలయం ఎక్కడ...?



మరమ్మతు పనులు నిలిచిపోయిన టౌన్ ప్లానింగ్ కార్యాలయ భవనం

నందికొట్కూరు: మున్సిపాలిటీ కార్యాలయం పరిధిలోని టౌన్ ప్లానింగ్ కార్యాలయం కనిపించకపోవడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాస్తు ప్రకారంగా ఉండాలంటూ రూ. 3 లక్షలతో టీపీఓ కార్యాలయానికి మరమ్మతులు చేయించేందుకు టెండర్ పిలిచారు. కొంత మేర పనులు అయ్యాక మధ్యలోనే నిలిపేశారు. దీంతో పట్టణ ప్రజలు టీపీఓ కోసం వచ్చి కార్యాలయం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత భవనంలోకి మార్చినట్లు మున్సిపల్ కార్యాలయ సిబ్బంది చెబుతున్నారని, ఎంత వెతికినా కనిపించడం లేదంటున్నారు ప్రజలు సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరిగినా అదిగో ఇక్కడే అని సిబ్బంది చెప్పినా అక్కడ అధికారులు కనిపించడం లేదని ఆందోళన చెందుతున్నారు. అసలు విషయం తెలుసుకున్న ప్రజలు బాగున్న కార్యాలయానికి మరమ్మతుల పేరుతో తూర్పు వైపు తలుపు పెట్టేందుకు రూ. 3 లక్షల వరకు ఎందుకు ఖర్చు వస్తుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వాస్తు పేరుతో భవనాలకు పట్టణ ప్రజల సొమ్మును ఎలా ఖర్చు చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.